క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను పదోన్నతులు, సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాసు పదోన్నతి పై కాకినాడ ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. కాకినాడ ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు పదోన్నతిపై కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు.

వినికిడి యంత్రాల పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇద్దరికి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా వినికిడి యంత్రాలను అందజేశారు. కరప మండలం నడకుదురుకు చెందిన తణుకు సరస్వతికి, కాజులూరు మండలం ఆర్యావటం గ్రామానికి చెందిన కోట వీరవెంకట సత్యనారాయణకు అందజేశారు. ఆ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

లాన్‌టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ డీఎస్‌ఏ, కల్పనా సెంటర్ వద్ద గల రాజేష్ టెన్నిస్ అకాడమీలో పోటీలు నిర్వహించగా అండర్-14 బాలికలు, బాలుర జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. అండర్-17 బాలికలు లీగ్‌దశలో విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరారు.

మెగా రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్: శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి ఫౌండర్ డే సందర్భంగా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏటా నవంబర్ 20వ తేదీన డాక్టర్ చంద్రశేఖర్ సంకురాత్రి కుమారుడు శ్రీకిరణ్ పుట్టినరోజు సందర్భంగా వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం రక్తదాన శిబిరాన్ని తిమ్మాపురం ఎస్సై కె.షరీఫ్, శ్రీకిరణ్‌కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని రోటరీ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ సహకారంతో నిర్వహించారు. శిబిరంలో 160 యూనిట్ల బడ్‌ను సేకరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లక్కరాజు టిక్కు, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

త్రైక్వాండోలో పతకాల పంట

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుంటూరులో ఈ నెల 18, 19 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనపరచి పలు విభాగాల్లో పతకాలు సాధించారని సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. ఈ పోటీల్లో 14 బంగారు, 7 రజత, 15 కాంస్య పతకాలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ విభాగంలో తూర్పు జట్టు ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అభినందించారు.

నేడు మండల సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన కరప మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కె.అప్పారావు ప్రకటనలో తెలిపారు.

గ్రేడ్-1 కమిషనర్‌గా కార్యదర్శి ఏసుబాబు

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబుకు గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు పురపరిపాలనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గ్రేడ్- 2 కమిషనర్ గా ఉన్న ఏసుబాబుకు గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడే కార్యదర్శిగా కొనసాగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: బైక్ చోరీ చేసిన వ్యక్తికి ఐదునెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్షరీన్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ధవళేశ్వరానికి చెందిన గుడే పవన్‌కుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 10న తూరంగిలో బైక్‌ను చోరీ చేశాడు. దీంతో బైక్ యజమాని పాలేపు సురేంద్ర ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో పవన్ కుమార్ పై నేరం రుజువు కావడంతో ఐదు నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

జర్మన్ లాంగ్వేజ్, డోమైన్ స్కిల్స్‌పై శిక్షణ

కాకినాడ సిటీ: బీఎస్సీ నర్సింగ్ పాసైన మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎస్‌టీయూకేలో 90 రోజుల జర్మన్ లాంగ్వేజ్, డొమైన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి సోమవారం ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నాక నెలకు రూ.లక్ష వరకూ జీతం ఉంటుందన్నారు. వివరాలకు 82888 73337, 99630 74879 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఖరీఫ్‌కు అల్పపీడనం

- పెరిగిన కూలి రేట్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



వేపకాయలపాలెంలో కోసిన పంటను గట్టుకు చేర్చేందుకు కట్టుకుంటున్న దృశ్యం

కరప: అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరికలు చేస్తుండటంతో ఖరీఫ్ పంట ఏమవుతుందోనని రైతుల్లో గుబులు రేగుతోంది. తుఫాన్ కారణంగా ఆకాశం మబ్బులు పట్టి సోమవారం ఉదయం నుంచి ఈదురు గాలులు వీస్తూ, అడపాదడపా చిరుజల్లులు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం బాగుండి, ఖరీఫ్ పంట కోతకు రావడంతో పంటను దక్కించుకుందామంటే తుఫాన్ వచ్చిపడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ సమయంలో వర్షాలు పడితే చేతికొచ్చిన పంట నీటిపాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 14 వేల ఎకరాల ఖరీఫ్ పంట సాగు చేశారు. ముదరగా ఊడ్చిన పొలాలు కోతకు రావడంతో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీపావళి అమావాస్యకు ఎటువంటి చినుకులు పడకపోవడంతో ఆనందపడి, కోతలు చేపట్టిన రైతులకు అల్పపీడనం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నాలుగురోజులుగా మబ్బులు లేకుండా వాతావరణం అనుకూలంగా ఉండటంతో కోతలు చేపట్టామని రైతులు అంటున్నారు. లేతగా ఊడ్చిన పొలాల్లో పంట పక్వదశకు చేరుకుంది. ఈ ఏడాది తుఫాన్లు, వర్షాలు రాకపోయినా, దిగుబడులు అంతంతమాత్రంగా ఉంటున్నాయని అనుకుంటుంటే గోరుచుట్టుపై రోకటిపోటు చందాన అల్పపీడనం దెబ్బతీస్తోందని రైతులు అంటున్నారు. ఈదురు గాలులకు కంకులనుంచి ధాన్యం రాలిపోతుందని, కోసిన చేలు, నేలనంటి ఉన్న వరిచేలు వర్షాలు పడితే పనిచేయకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఆకాశం మబ్బులు పట్టి, వాతావరణం మారడంతో కూలిరేట్లు కూడా పెరిగిపోయాయి. మగవారికి రూ.800 లు ఉండే కూలీ రూ.1,300, మహిళలకు రూ.400 నుంచి రూ.600కు పెంచేశారని, అయినా కూలీలు దొరకడంలేదని రైతులు తెలిపారు. కోసినచేలను హడావుడిగా కుప్పలు వేసుకోవడం, నూర్పిళ్ల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నూర్పిడిచేసిన ధాన్యాన్ని లేఅవుట్లలోకి తీసుకొచ్చి, రాశులు చేసి, తడిసిపోకుండా బరకాలతో కప్పి ఉంచుకుంటున్నారు. ఈ తుఫాన్ గండం నుంచి గట్టెకించాలని రైతులు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.



కరపలో గట్టుకు తెచ్చిన పంటను ట్రాక్టర్‌తో నూర్పిడి చేస్తున్న దృశ్యం

వాతావరణం బాగుందని కోయించాం

దీపావళి అమావాస్య వెళ్లాక వాతావరణం బాగుందని తొలకరి చేను కోయించాను. పనపై తడిసిపోతే రంగు మారిందని, తేమగా ఉందంటూ వ్యాపారులు అయినకాడికి అడుగుతారు. కుప్ప వేయిద్దామంటే కూలీలు దొరకడం లేదు. పెరిగిన రేట్లతో పని చేయించలేక, దేవుడిపై భారంవేసి, పనపైనే వదిలేశాను.

వెలుగబంట్ల రవినాయుడు, రైతు కూరాడ

కూలి రేట్లు అమాంతం పెంచేశారు

ఖరీఫ్ చేను కోతకు రావడంతో మాసూళ్లు పనులు చేపట్టాం. నిన్నటివరకు రోజుకూలీ రూ.800 తీసుకుంటే ఆకాశం మబ్బులు పట్టడంతో ఒక్కసారిగా రూ.500 పెంచేశారు. జోడాకు రూ.2,600 తీసుకుంటున్నారు. మెషీన్ కోతకు కూడా ఎకరానికి రూ.3 వేల నుంచి రూ.3,500కు పెంచేశారు. ఖరీఫ్‌లో పెట్టుబడులకు, మగతాకే సరిపోయేలా ఉంది.

పెంకే అప్పన్న, కౌలురైతు, కరప

శ్రీ పీఠం... భక్తి కెరటం

- పద్మశ్రీ శోభారాజు భక్తి సంకీర్తనలు
- మహిళల కుంకుమ పూజలు



అనుగ్రహ భాషణ చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: శ్రీ పీఠంలో మహాశక్తి యాగం 7వ రోజుకు చేరుకుంది. వేలాదిగా తరలివస్తున్న మహిళలతో గోశాల ప్రాంగణం కిటకిటలాడుతోంది. మహాశక్తి యాగం వేదికపై సోమవారం ముఖ్య అతిథి పద్మశ్రీ శోభారాజు భక్తి సంకీర్తనలు ఆలపించగా వేదిక ముందు ఆశీనులైన వారంతా ముగ్ధులయ్యారు. పూరిపూర్ణనంద స్వామి అనుగ్రహ భాషణ అనంతరం శతకోటి లలితా కుంకుమార్చనల క్రతువులో మహిళలు పాల్గొన్నారు. రోజురోజుకు మహిళల సంఖ్య పెరుగుతుండగా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. ఏడురోజులకు సుమారు 20లక్షల కుంకుమార్చనలు చేసినట్టు పరిపూర్ణనంద స్వామిజీ తెలియజేశారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం పంచలోహ పార్వతీ, పరమేశ్వర విగ్రహాలు పల్లకి సేవగా ఊరేగింపు, దీపోత్సవాలతో శ్రీపీఠం సందడిగా మారిపోయింది.

ప్రవాస భారతీయుల కోసం పూజ

విదేశాలలో భక్తుల కోరిక మేరకు సోమవారం ఉదయం పరిపూర్ణనంద స్వామి ప్రవాస భారతీయులకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలను నిర్వహించారు.

స్వర్ణాంధ్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: స్థానిక 12వ డివిజన్ స్వర్ణాంధ్రకాలనీలోని రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాలును సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న హాజరయ్యారు.

పార్కు ప్రారంభం

స్థానిక 13వ డివిజన్ రెవెన్యూ కాలనీలో నూతనంగా రూ.75 లక్షల 15వ ఆర్థికసంఘ నిధులతో నిర్మించిన పార్కును ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి సోమవారం ప్రారంభించారు. 1.10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ పార్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రాతిపదిక

వై ఏపీ నీడ్స్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి


కాకినాడ: సంక్షేమ పథకాల ఎంపికకు అర్హతే ప్రాతిపదిక అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేసి పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఏపీలో మాత్రమే ఉందన్నారు. స్థానిక 44, 46 డివిజన్లకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమావేశం శారదాదేవి ఆలయ ప్రాంతంలో జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఈ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

బాబు, పవన్‌లను నమ్మొద్దు

మోసపూరిత వాగ్దానాలతో మరోసారి ఎన్నికలకు సిద్ధమవుతోన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘన చరిత్ర చంద్రబాబుదైతే, సొంతంగా పోటీచేసే సత్తాలేక పొత్తుల కోసం వెంపర్లాడుతున్న వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. వీరికి రాజకీయ స్వప్రయోజనాలే తప్ప ప్రజల సంక్షేమం పట్టదన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, నాయకులు గూటాల రామకృష్ణ, కొలగాని దుర్గాప్రసాద్, కె.బాలాప్రసాద్ పాల్గొన్నారు.

శివాలయాల్లో 'కార్తిక' సందడి

- తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- దర్శనాల కోసం పోటెత్తిన భక్తులు



కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: కార్తికమాసం తొలి సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భానులింగేశ్వరస్వామిని సుమారు ఐదు వేల మంది దర్శించుకొన్నారు. ఆలయంలో భక్తులు, అయ్యప్ప దీక్షా పరుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు) తెలిపారు. రామారావుపేటలోని శివాలయంలో ఉచిత దర్శనంతోపాటు, రూ.10, రూ. 20 దర్శనాలు ఏర్పాటు చేశారు. సాగరతీరాన ఉన్న ఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కాకినాడ రూరల్: మండలంలో నేమాం, సర్పవరం, తిమ్మాపురం, తూరంగి, ఇంద్రపాలెం, రేపూరు, పండూరు, రమణయ్యపేట గోకుల్ గార్డెన్, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ ఆలయాలలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కరప: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జామున 3 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభ మయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపం వద్ద స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విశ్వాలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి పూజాదికాలు నిర్వహించారు. కూరాడ శివారు చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఏర్పాట్లు చేశారు. అరట్లకట్ట, కొరిపల్లి, నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, సిరిపురం, వాకాడ, వేములవాడ శివాలయాల్లో సందడి నెలకొంది. అయ్యప్ప స్వాములు శివాలయాలకు పోటెత్తారు.

క్రైస్తవుల సంక్షేమానికి తోడ్పాటు

- ఎంపీ గీత
- కమ్యూనిటీహాలు ప్రారంభోత్సవం



క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: క్రైస్తవులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. రూ.48 లక్షల కార్పొరేషన్ సాధారణ నిధులతో రెవెన్యూ కాలనీలో నిర్మించిన క్రిస్టియన్ కమ్యూనిటీహాలును ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న హాజరయ్యారు. ఎంపీ గీత మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులకు అన్నింటా సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం, చర్చిల అభివృద్ధికి నిధుల మంజూరుతోపాటు అనేక అంశాల్లో ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ క్రైస్తవుల కోసం అత్యాధుని వసతులతో శ్మశానవాటికతోపాటు, 3వేల మంది సామర్థ్యంతో మెక్లారిన్ గ్రౌండ్స్‌ను ఓపెన్ ఆడిటోరియంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ పై భాగాన్ని నిర్మించడంతోపాటు ఇతర అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ తరపున సహకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జోసెఫ్ బెన్ని, శ్యామ్ బెన్ని, పలివెల ఐజక్, హెన్రి, పరిమి ఐజక్, శీరం ఐజక్, మిస్సా విజయ్‌కుమార్, రిక్కి గూటం, రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి ఎండి అస్గర్, పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

బాలాజీచెరువు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపులో భాగంగా మంగళవారం పాల్గొని మాట్లాడుతూ జగనన్న మదిలో మరో కలికితురాయి డిజిటల్ గ్రంథాలయాలు అన్నారు. మొదటి విడతగా 6వేల సచివాలయాల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందని, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లు దూరంపెట్టి గ్రంథాలయాల పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్ మాట్లాడారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీలు పరిశీలించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్, దూలం పద్మ వెంకన్నబాబు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు తుమ్మలపల్లి జయకృష్ణ, ఏడీ రవికుమార్, కిషోర్ పాల్గొన్నారు.

సమాజానికి మేలు

కాకినాడ: గ్రంథాలయ వ్యవస్థ సమాజానికి మేలు చేసే విజ్ఞానాన్ని అందిస్తుందని కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక వివేకానంద పార్క్‌లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ సోమవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ లైబ్రరీలు విజ్ఞాన భాండాగారాలన్నారు. ఎంతోమందిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన చరిత్ర లైబ్రరీ వ్యవస్థకు ఉందన్నారు. ఈ సందర్భంగా కాకినాడ నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలలో విజేతలకు డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేశారు. లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు, ఓరియంటల్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం

కరప: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు ప్రతిరోజు కొంతసమయాన్ని కేటాయించి గ్రంథాలయానికి వచ్చి దినపత్రికలు, జీకే, తదితర పుస్తకాలు చదువుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్థానిక ఉపగ్రంథాలయంలో 56వ గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ఆమె అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ ఎన్‌వీఎస్ ఫణీంద్రకుమార్, హైస్కూలు హెచ్‌ఎం యు.లీలామనోహర్ పాల్గొన్నారు. వేళంగిలో నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, మెర్ల వీరయ్యచౌదరి, లైబ్రేరియన్ పి.వెంకటరంగయ్య మాట్లాడారు.

జనరంజక పాలన సీఎం జగన్‌కే సాధ్యం

పెనుగుదురులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే...

కరప: రాజకీయాలకతీతంగా నవరత్న పథకాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. పెనుగుదురులో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ 99 శాతం నెరవేర్చారని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా చెప్పని పథకాలను కూడా అమలుచేశారన్నారు. ప్రజాసంక్షేమంకోసం ఆలోచన చేస్తున్న సీఎం జగనన్నను, ఎమ్మెల్యే కురసాల కన్నబాబులను గెలిపించేందుకు వచ్చే ఎన్నికల్లో కూడా మద్దతు తెలపాలన్నారు. గ్రామ వలంటీర్లకు ఏపీకి జగనే ఎందుకు కావాలంటే బుక్‌లెట్ లున్న బ్యాగులను అందజేశారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామకూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల వైఎస్సా ర్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డిపల్లి రమేష్, పెంకే సత్తిబాబు పాల్గొన్నారు.

నేమాం మరో కాకినాడగా అభివృద్ధి

ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు



ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: నేమాం మరో కాకినాడగా మారబోతోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సముద్రతీర గ్రామమైన నేమాం గ్రామ పరిధిలో పేదల ఇళ్ల స్థలాల కోసం లే అవుట్‌లు అభివృద్ధి చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా నేమాం పంచాయతీ వద్ద సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అందించిన సంక్షేమ పథకాలు డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ నేమాం గ్రామంలో రూ.38.3 కోట్ల సొమ్మును సంక్షేమ పథకాలుగా గ్రామస్తులకు అందించామన్నారు. గ్రామంలో సుమారూ రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నేమాంలో ఏర్పాటు చేసిన వైఎస్ జగన్మోహనపురం లేవుట్, మరో రెండు లే అవుట్‌లు గ్రామాలను తలపించనున్నాయని, మొత్తం నేమాం జనాభా విపరీతంగా పెరుగుతుందన్నారు. విలువైన స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు చేసుకుని గృహ ప్రవేశాలు చేస్తుండడం సంతోషాన్ని ఇస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా సంక్షేమ పథకాలను సీఎం జగనన్న ఇచ్చారన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలో వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో తమ గ్రామం మెరుగ్గా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు వాసంశెట్టి సత్యవేణి, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్ల చందు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 71 ఫిర్యాదులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 71 మంది వివిధ సమస్యలపై తమ ఫిర్యాదులు అందించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు

బాలాజీచెరువు: ఈ నెల 16 నుంచి 18వరకూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 ఖో-ఖో పోటీలలో ప్రగతి ఇంటర్‌మీడియట్ ఎంపీసీ విద్యార్థి గొంప పావని ప్రతిభ చూపి డిసెంబర్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికయింది. అక్టోబర్‌లో చిత్తూరులో నిర్వహించిన 42వ ఏపీ జూనియర్ చాంపియన్ షిప్ అండర్-18 ఖో-ఖో పోటీల్లో ఇంటర్‌మీడియట్ విద్యార్థులు నంగన ఐశ్వర్య,అరనపల్లి మౌనిక,జి.పావని లు ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, డైరెక్టర్ హిమబిందు, ఎజీఏం అనిల్‌బాబు, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం

కాకినాడ: ప్రజా సమస్యలకు సత్వర, నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, అనంతరం స్పందన కార్యక్రమం జరిగింది. 14 మంది ఫోన్ ద్వారా, 12 మంది నేరుగా స్పందనలో కమిషనర్‌కు సమస్యలు వివరించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం, గృహ నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదులు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ వెంకట్రావు, టీపీఆర్‌ఓ కృష్ణమోహన్, పాల్గొన్నారు.

త్వరలో రెండో విడత టిడ్కో ఇళ్ల అప్పగింత

కాకినాడ: రెండో విడత టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అప్పగించేందుకు పనులు వేగవంతం చేయాలని కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యేలు వంగా గీత, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధికారులను కోరారు. సోమవారం వీరు టిడ్కో, మెప్మా, కార్పొరేషన్ అధికారులతో కలిసి సంజయ్‌నగర్‌లోని టిడ్కో ఇళ్ల సముదాయాన్ని సందర్శించారు. అక్కడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే మొదటి విడత 1,152 ఇళ్ళ నిర్మాణం పూర్తి అయ్యిందని, ఇప్పుడు రెండవ విడత 904 ఇళ్ల విషయంలో అధికారులు వేగం పెంచాలన్నారు. అంతర్గత అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన వచ్చే రెండు వారాల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్‌లో టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, టిడ్కో ఈఈ రీటా, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు పాల్గొన్నారు.

భోగి గణపతికి పంచామృతాభిషేకం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న భోగి గణపతికి సోమవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులుదూసర్లపూడి రమణరాజు సహస్రనామ జప యజ్ఞం నిర్వహించారు.

హస్తకళలను ప్రోత్సహించాలి

కాకినాడ రూరల్: హస్తకళలను ప్రోత్సహించడంతో ద్వారా జీవనోపాధి పొందుతున్న వారిని ఆదుకున్నట్టు అవుతుందని కాకినాడ రూరల్ నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఎస్ఆర్ఎంటీ ఎదురుగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండ్ క్రాఫ్ట్ ఎక్స్‌పో - 2023ను ఆయన ప్రారంభించారు.

లయనిజంలో సేవ ద్వారా ఫెలోషిప్

బోట్‌క్లబ్: లయనిజం వంటి సంస్థలో సేవ ఫ్రెండ్షిప్, ఫెలోషిప్ అభివృద్ధికి దోహదపడుతుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. పుణ్యక్షేత్రాల దర్శనాంతరం కాకినాడ చేరుకున్న బృందానికి స్వాగతం పలికారు. ఆర్మీ విశ్రాంత అధికారి పి.మంగరాజు పాల్గొన్నారు.